క్లుప్తంగా

బడిబాట ర్యాలీ



బడిబాట ర్యాలీలో ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట: ప్రైవేట్‌కు దీటుగా సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలన్నారు. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారి పిల్లలను వయస్సుకు తగిన తరగతిలో చేర్పించాలని సూచించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలన్నారు. ప్రధానోపాధ్యాయులు దబ్బెడ హన్మాండ్లు, కుబేర స్వామి, ఎస్‌ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులందరికీ జీవనభృతి అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వేములవాడఅర్బన్: 2019లో పీఎఫ్ పొందిన కార్మికులందరికీ జీవనభృతి నెలకు రూ.2,016 అందించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. వేములవాడ తహసీల్దార్ రాజుకు గురువారం వినతిపత్రం అందజేశారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న ప్యాకింగ్, చెకింగ్ గుమాస్తాలకు, టెకేదారులకు జీవనభృతి అమలు చేయాలన్నారు. ఈపీఎస్ పెన్షన్ రూ. 6 వేలు ఇవ్వాలన్నారు. మల్లేశం, అనసూర్య పాల్గొన్నారు.

రెడ్డి సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న నాయకులు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో శ్రీరాజరాజేశ్వర రెడ్డి సంఘం భవన నిర్మాణానికి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు గురువారం భూమిపూజ చేశారు. రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ సుమతి, ఎంపీటీసీ మంజుల, రెడ్డి సంఘం అధ్యక్షుడు ముద్దం కిరణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం

- రాకపోకలకు కాలనీవాసుల ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది చంద్రంపేట 12 వార్డులోని పోచమ్మ ఆలయం సమీపంలోని వీధి. రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పి దాదాపు ఏడాది క్రితం పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా కంకర పోసి వదిలిపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు సీసీ రోడ్డు నిర్మించాలని వేడుకుంటున్న రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. కంకర రోడ్డులో కాలనీ వాసులు నడిచేందుకు ఇబ్బంది పడుతున్నారు.



ఒకటో వార్డులో రోడ్డు పరిస్థితి



ఈ చిత్రంలో కనిపిస్తున్నది చంద్రంపేటలోని జ్యోతినగర్‌లోని 1వ వార్డులోని రోడ్డు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారింది. జ్యోతినగర్‌లో చాలా వరకు మట్టి రోడ్లే ఉన్నాయి. దీంతో ఆయా కాలనీల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో తాత్కాలికంగా మట్టిని పోస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి విలీనమైన గ్రామాల్లో ఎక్కడ చూసిన సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. మున్సిపల్‌లో విలీనమై ఏళ్లు గడిచిన పరిస్థితి ఏమాత్రం మారడం లేదు. కనీస మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేట గ్రామం సిరిసిల్ల పట్టానికి ఆనుకునే ఉంటుంది కానీ, అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. చంద్రంపేట, జ్యోతినగర్‌లో పలుచోట్ల అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి. నిర్మాణాలు చేపట్టాలని పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

ఇబ్బందుల్లో కాలనీవాసులు

చంద్రంపేటలోని 12వ, 1వ వార్డు జ్యోతినగర్‌లో పలుచోట్ల అసంపూర్తిగా సీసీ రోడ్ల నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. ఎక్కడ పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణాలు చేపట్టలేదు. చంద్రంపేటలోని పోచమ్మ వీధి సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతామని చెప్పి కంకర పోసి ఏడాదికి పైగా కావస్తున్న ఇప్పటికీ పూర్తి కాలేదు. దీంతో కాలనీవాసులు అదే కంకర రోడ్డు నడుస్తూ కాలం వెల్లదీస్తున్నారు. విసిగిపోయిన కాలనీవాసులు ఇటీవల రోడ్డుపైకి వచ్చి నిరసన చేపట్టారు. అంతేగాక కొన్నిచోట్ల సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో రోడ్డు బీటలు వారుతున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. 1వ వార్డు జ్యోతినగర్‌లోని కొన్నిచోట్ల మట్టి రోడ్లతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వస్తే అడుగు తీసి అడుగు పెట్టలేనంతగా చిత్తడిగా మారుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. బురదమయంగా ఉన్న రోడ్లపై వెళ్లాలంటే పడరాని పాట్లు పడుతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్నది వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం



కాలనీలో రోడ్డు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. బురద రోడ్డుపై నడవాలంటే చాలా ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు నిర్మిస్తామని అంటున్నారు కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అధికారులు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

– వేముల వెంకటేశం చంద్రంపేట, జ్యోతినగర్ 1వ వార్డు

కంకర పోసి ఏడాది దాటింది



మా కాలనీలో ఎలక్షన్లప్పుడు రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతామని చెప్పి కంకర పోసి ఏడాదవుతుంది. ఇప్పటికీ నిర్మాణం చేపట్టలేదు. చాలాసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పుడు అప్పుడు అంటూ కాలయాపన చేస్తున్నారు. – కోడం నాగభూషణం, చంద్రంపేట

సీసీ రోడ్డు నిర్మించాలి



చంద్రంపేటలో కొన్ని చోట్ల సీసీ రోడ్డు పూర్తిస్థాయిలో నిర్మించలేదు. రానున్నది వర్షాకాలం ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. శాశ్వత పరిష్కారానికి మార్గం చూపాలి. అధికారులు స్పందించి సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి

– కాంభోజ శ్రీధర్, చంద్రంపేట

నియామకం

అదర్శ అంబేడ్కర్ సంక్షేమ సంఘం కార్యవర్గం

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని అదర్శ అంబేడ్కర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుర్రం తిరుపతి, ఉపాధ్యక్షుడిగా పిట్టల నర్సయ్య, ప్రధానకార్యదర్శిగా గుండం నర్సయ్య, కోశాధికారిగా పిట్టల శ్రీనివాస్, ప్రచారకార్యదర్శిగా పిట్టల దేవయ్యను నియమించినట్లు తెలిపారు.

ఆధ్యాత్మికం

పోచమ్మ బోనాలు



గంభీరావుపేట: మండలం భీమునిమల్లారెడ్డిపేటలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండుగ గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి బోనాలతో మహిళలు ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల మధ్య బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యాన్ని సమర్పించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, ఎంపీపీ కరుణ, సర్పంచ్ మహేశ్వరి, ఎంపీటీసీ రాజేందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ ఆంజనేయులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కోనరావుపేట: మండలంలోని అజ్మీరాతండా శివారులోని నూతనంగా నిర్మించిన శివలాల్ మహరాజ్, సేవాలాల్ మహరాజ్, భవానీ అమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మండలాధ్యక్షుడు షేక్ పిరోజ్ పాషా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ దివ్య, ఆలయ చైర్మన్ మోహన్‌నాయక్, వైస్‌చైర్మన్ నాజ్జమ్ నాయక్, ఆలయ కమిటీ సభ్యులు అమృతలాల్, కిషన్ నాయక్, మధన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. స్థానిక ఏఎంసీలో అభివృద్ధి పనుల కోసం రూ.1.28 కోట్లు మంజూరు కాగా, గురువారం ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, డైరెక్టర్లు ఆయనకు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ.10 వేలు ఇవ్వడంతో పాటు, రైతు బీమా ద్వారా రూ.5 లక్షల సాయం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, వైస్‌చైర్మన్ ఎంద్ర చందన్, డైరెక్టర్లు బాబు, సంతోష్‌రెడ్డి, బాబి, ప్రశాంత్‌రెడ్డి, మల్లయ్య, రాజేందర్‌రెడ్డి, మధు, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఏఎంసీ చైర్మన్

రేణుకా ఎల్లమ్మ సన్నిధిలో..

మండలంలోని కందికట్కూర్ శ్రీ రేణుకా ఎల్లమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం శకటోత్సవ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ దర్శించుకున్నారు.

అటెన్షన్ ప్లీజ్



పరదాలే ప్రహరీ

ముస్తాబాద్: మండలంలోని గూడెంలో ఇటీవల నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి పరదాలే రక్షణగా నిలుస్తున్నాయి. ఈ భవనానికి ప్రహరీ లేకపోవడంతో పశువులు, కుక్కలు పరిసరాల్లోకి సంచరిస్తున్నాయి. ఉప కేంద్రాలను ప్రభుత్వం పల్లె దవాఖానాలుగా మార్చి, అన్ని వసతులు కల్పిస్తోంది. కాని గూడెం పల్లె దవాఖానాకు మాత్రం ప్రహరీతో పాటు వసతులు కల్పించడం మరిచారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: అశోక్, పంచాయతీ కార్యదర్శి, గూడెం

సెల్ నెంబర్: 99592 59314

దశాబ్ది ఉత్సవాలపై సమీక్ష



మాట్లాడుతున్న జెడ్పీటీసీ గుగులోత్ కళావతి

ఎల్లారెడ్డిపేట/రుద్రంగి/వీర్నపల్లి/కోనరావుపేట: దశాబ్ది ఉత్సవాలపై మండల పరిషత్ కార్యాలయాల్లో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 2 నుంచి 22 వరకు ఘనంగా నిర్వహించాలని సూచించారు. వీర్నపల్లిలో ఎంపీడీవో నరేశ్ కుమార్, తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్, జెడ్పీటీసీ కళావతి, ఎంపీపీ భూల, రుద్రంగిలో ఎంపీపీ స్వరూపారాణి, ఎంపీడీవో శంకర్, ఎంపీవో సుధాకర్, ఎల్లారెడ్డిపేటలో తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీడీవో చిరంజీవి, కోనరావుపేటలో ఎంపీపీ చంద్రయ్యగౌడ్, ఎంపీడీవో రామకృష్ణ, ఎస్సై రమాకాంత్, ఎంపీవో రాజు, పంచాయితీ కార్యదర్శులు, వీఈవోలు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

నిరుద్యోగులతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి: నిరుద్యోగుల జీవితాలతో చలగాటం ఆడుతుందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్ చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి, తంగళ్లపల్లి మండలంలోని లక్ష్మీపూర్, అంకుషాపూర్, బస్వాపూర్ గ్రామాల్లో గురువారం పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. పోలీసు పోస్టుల భర్తీ తప్ప మిగతా ఉద్యోగాలు ఎక్కడ భర్తీ చేయడం లేదన్నారు. ఇప్పటి వరకు నిరుద్యోగ భృతి అందించడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాంటి స్వేచ్ఛలేకుండా వారిపై ఉక్కుపాదం మోపుతుందన్నారు. ఉద్యోగులు తమ న్యాయమైన హక్కుల కోసం పోరాడితే ఉద్యోగాలు తొలగిస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వడ్ల కొనుగోలు కేంద్రాల నుంచి తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు జీవనభృతి కల్పిస్తామన్నారు. మండల అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, జాలగం ప్రవీణ్(టోని), జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, జిల్లా రైతు సెల్ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు సూర దేవరాజు, రైతు సెల్ మండల అధ్యక్షుడు పొన్నాల పరుశురాం నాయకులు పాల్గొన్నారు.



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

ముగిసిన భాషా శిక్షణ శిబిరం



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో డీఈవో

సిరిసిల్లకల్చరల్: మాతృభాషతో పాటు మరో భాషను నేర్చుకునేందుకు విద్యార్థులు నిరంతరం సాధన చేయాలని డీఈవో రమేశ్ అన్నారు. గురువారం విజ్ఞాన వర్ధినిలో నెల రోజులుగా వేసవి సెలవుల సద్వినియోగం కోసం ఇంగ్లిష్ భాషా శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. టీచింగ్ సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంగ్లిష్ భాష నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకుడు మందాడి భాస్కర్‌రెడ్డి, సంస్థ నిర్వాహకుడు జీఎస్ అరవింద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గద్దెను కూల్చివేతపై నిరసన

ముస్తాబాద్: మండలంలోని మొర్రాపూర్ తండాలో కాంగ్రెస్ జెండా గద్దెను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ నాయకులు ముస్తాబాద్‌లో గురువారం రాస్తారోకో చేపట్టారు. రాజీవ్ చౌక్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రజల్లో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక జెండా గద్దెను అధికార పార్టీ నాయకులే కూల్చివేశారని ఆరోపించారు. ఊరురా కాంగ్రెస్ జెండా పండుగను నిర్వహిస్తామన్నారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైన కాంగ్రెస్ ప్రజల పక్షాన ఉంటుందన్నారు. పోలీసులు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షుడు బుర్ర రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, దీటి నర్సింలు, రాజేశం, కిషన్, సత్యంగౌడ్, రాంరెడ్డి, రాజిరెడ్డి, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబైన కార్యాలయాలు



మెరిసిపోతున్న తంగళ్లపల్లి ఎంపీడీవో ఆఫీస్

తంగళ్లపల్లి/వేములవాడరూరల్/బోయినపల్లి: తెలంగాణ ఆవిర్భావ పదేళ్ల పండుగ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. గురువారం రాత్రి వెలుగుజిలుగులతో కాంతులీనాయి. తంగళ్లపల్లి ఎంపీడీవో కార్యాలయం తోపాటు తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, పలు ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ వెలుగులు సంతరించుకున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆదేశాలతో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా గద్దెలు సిద్ధం చేసి పచ్చని తోరణాలతో ఏర్పాట్లను పూర్తి చేశారు.బోయినపల్లిలో ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీలు ముస్తాబు అవుతున్నాయి. సెస్ కార్యాలయం విద్యుత్ కాంతులతో మెరిసిపోతోంది.

పంట పొలాలకు దారి ఏర్పాటు చేయాలి

ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని మానేరు కెనాల్ నుంచి పోతుగల్ వరకు ఉన్న తమ పంట పొలాలకు దారి నిర్మించాలని ఎంపీపీ జనగామ శరత్‌రావుకు స్థానిక రైతులు గురువారం విజ్ఞప్తి చేశారు. సుమారు వంద ఎకరాలకు దారిలేక 50 మంది రైతు కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నామని రైతులు వివరించారు. వరి నాట్ల నుంచి కోతల వరకు రవాణా సదుపాయం లేదన్నారు. ముఖ్యంగా యూరియా, ఎరువులు చేరవేయడం ఇబ్బందిగా మారిందన్నారు. దీనికి స్పందించిన ఎంపీపీ శరత్‌రావు మాట్లాడుతూ ఇప్పటికే రైతులు స్వచ్ఛందంగా కొన్ని పనులు చేయించారని, కల్వర్టులు, దారి మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులు తాళ్ల చంద్రారెడ్డి, నీలం భూపతి, యెల్ల మల్లారెడ్డి, కంతుల బాలయ్య, ఎల్లం, గద్దల బాలయ్య, కొడె సిద్దయ్య, కిష్టారెడ్డి, దేవేందర్, బిక్షపతి, భూంరెడ్డి, రాజు పాల్గొన్నారు.



ఎంపీపీ శరత్‌రావుకు విజ్ఞప్తి చేస్తున్న రైతులు

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోండి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్

వీర్నపల్లి: మండలంలోని కంచర్ల, బంజేరు, బాబాయి చెరువు తండా, భూక్యతండా, బావుసింగ్ నాయక్ తండా, మద్దిమల్ల, గర్జనపల్లి గ్రామాల్లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ భూపెందర్ గురువారం బీమా పథకాలపై ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రవికుమార్ వర్మ, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

చందుర్తి: మండలంలోని నర్సింగపూర్ గ్రామంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని గ్రామ మాజీ సర్పంచ్ ఎర్రం శ్రీమన్నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లారీల కొరతతో 10 రోజులుగా ధాన్యం కాంటా వేయడం నిలిపి వేశారని తెలిపారు.

కొనుగోళ్లు పూర్తి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లిలో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేసినట్లు ఏపీఎం మల్లేశం గురువారం తెలిపారు. మండలంలోనే మొట్టమొదటిసారిగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించినట్లు తెలిపారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి గ్రామంలో గురువారం ఎంపీపీ పడిగెల మానస ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొయ్యడ రమేశ్, ఎంపీటీసీ గుగ్గిళ్ల లావణ్య, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..

రుద్రంగి: మండల కేంద్రంలోని నలుగురు లబ్ధిదారులకు ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఏఎంసీ వైస్ చైర్మన్ కంటి రెడ్డి, నాయకులు గంగం మహేశ్, పూదరి శ్రీనివాస్, మంచె రాజేశం పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బోయినపల్లి: మండల కేంద్రానికి చెందిన కన్నం రామస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి గురువారం 1991–92 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

బూత్ కమిటీల పటిష్టతతో బహుజన రాజ్యం

బోయినపల్లి: గ్రామాల్లో బీఎస్పీ బూత్ కమిటీలు పటిష్ఠంగా పనిచేసినపుడే బహుజన రాజ్యం వస్తుందని బీఎస్పీ చొప్పదండి అసెంబ్లీ ఇన్‌చార్జి కొంకటి శేఖర్ అన్నారు. మండలంలోని గురువారం జగ్గారావుపల్లి గ్రామ ఉపసర్పంచ్ రామంచ శ్రీనివాస్ బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు మాంకాళి తిరుపతితో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సారథ్యంలో బహుజనులు ఏకమై రాష్ట్రంలో బహుజన రాజ్యం తెస్తారని తెలిపారు. రత్నంపేట బూత్ కమిటీ అధ్యక్షుడిగా మార రాజేందర్‌ను నియమించారు.



నియామక పత్రం అందిస్తున్న ఇన్‌చార్జి శేఖర్